# రంగుల కథ



చక్రవర్తి చనిపోయి ఇరవై నాలుగు గంటలు దాటింది. నగరం అంతా విషాదం మబ్బులు కమ్ముకొని ఉన్నాయి. మబ్బులన్నీ అభిమానుల కళ్లలోనుంచి నీటి ధారలు కురిపిస్తున్నాయి. అయినా అందరి మనసుల్లోనూ ఏదో తెలీని సందేహం!

చక్రవర్తిది హత్యా? ఆత్మహత్యా?

'ఆ పెద్దాయన గొప్పధైర్యవంతుడు. ఆత్మహత్య చేసుకునేంత పిరికిపంద కాదాయన!' ఒకరి వాదం.

ఆత్మహత్య చేసుకోవాలంటే గుండె ఎంత దిటవు చేసుకోవాలో నీకేం తెలుసు అంత ధైర్యం ఆయనకే తగును! ఇంకొకరి సమాధానం.

'అయి ఉండదు. అది తప్పకుండా హత్యే! ఆయన్ను ఇన్నాళ్ళు ఆ గదిలో బందీచేసి ఉంచారు. అది చాలదన్నట్లు ఇప్పుడు విషం పెట్టి చంపేశారు!'

'విషమే అంటావా అది!'

'తప్పకుండానూ! లేకపోతే ఆ వాంతులు ఎందుకవుతాయి? ఒళ్ళంతా ఎందుకు పచ్చబడుతుంది?'

'అంతే అయి ఉంటుంది. అంతా ఆస్తికోసమే అయి ఉంటుంది!!' ఇది మరో రకం వాదం.

వాదాలు, ప్రతివాదాలు ఎలా ఉన్నా అందరూ ఒకే మాటగా ఒప్పుకుంటున్న నిజం ఒకటి ఉంది. చక్రవర్తిది మాత్రం చెప్పుకోదగ్గ జీవితం!!

కాదూ మరి!!..

బతికినంత కాలం బహు గొప్పగా బతికాడు చక్రవర్తి. ఎవరిమీదనైనా పగబడితే, వారి అంతం చూసేంతవరకూ నిద్రపోయే వాడుకాడు. అలాగని చక్రవర్తి రాక్షసుడనీ అనలేం. ఎవరిమీదైనా ఆపేక్ష కలిగిందంటే రెండు చేతులా అందిందంతా అందించేవాడు, వాళ్ళను అన్ని విధాలా ఆదుకొనేవాడు.

అందుకే శత్రువులు అతన్ని బహుభయంకరంగా అసహ్యించుకొనేవారు, అభిమానులు అతన్ని బహువిపరీతంగా ప్రేమించేవారు.

ఎవరి కారణాలు వారివే అయినా, ఇరువర్గాలవారికి చక్రవర్తి ఎలా పోయాడు అన్న ఆసక్తి మాత్రం అధికంగానే ఉండటం విశేషం. ప్రజల్లో చక్రవర్తికి గల అభిమాన శత్రుత్వాలు రెండూ కలిసి, అసలు కారణం తెలుసుకొని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తమ మీద ఉందని తెలిసి, ప్రభుత్వం చక్రవర్తి చనిపోయిన కారణం తెలుసుకోవాల్సిందిగా ఓ వైద్య బృందాన్ని నియమించింది.

ఇప్పుడు జరుగుతోంది అదే పోస్ట్‌మార్టమ్.

వైద్యరంగంలో నిష్ణాతులైన వాళ్లు నలుగురు, చక్రవర్తి సజీవంగా ఉన్నప్పుడు వైద్యం చేసిన ఆయన పర్సనల్ ఫిజీషియన్ డాక్టర్ సంజీవరావు మొత్తం అయిదుగురూ పోస్ట్‌మార్టమ్ నిర్వహిస్తున్నారు.

దేశంలో ఉన్న టెలివిజన్‌కంపెనీలన్నీ అదీ ఇదీ అన్న తేడా లేకుండా అన్నీ చక్రవర్తి కీర్తిశేషులైన వైనాన్ని, దాని పూర్వాపరాలను, పర్యవసానాన్నీ, అశేష ప్రజలకు సశేషంగా మిగిలిపోతున్న విషాదాన్ని అక్షరాలా సజీవ ప్రసారం చేస్తున్నాయి.

పోస్ట్‌మార్టమ్ చేస్తున్న వైద్యబృందంగనుక తమ పరీక్షల్ని పూర్తిచేసి, అసలు కారణాలను, తమ నివేదికలను బయట పెడితే ఆ వివరాలకు అక్షరరూపం ఇచ్చేందుకు స్థానిక పత్రికలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకొని, నివేదికకోసం శవజాగరణ చేస్తున్నాయి.

చనిపోయిన ఆ చక్రవర్తి చావకముందు చెప్పకుండా శరీరంలో దాచేసుకొన్న నిజాలను, ఆయన శరీరం అయినా బయటపెడుతుందా అన్న విషయం తెలుసుకోవాలని ప్రజలు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు.

ఆకాశం దిగువనా, నేలమీదా అంతా సస్పెన్స్!

అలాంటి సమయంలో విడుదలయింది పోస్ట్‌మార్టమ్ నిర్వహించిన నిపుణుల నివేదిక! చక్రవర్తి మరణానికి కారణం కాన్సరస్ అల్సర్ ఆఫ్ ది స్టమక్ మాత్రమే అన్నది నివేదన!

టెలివిజన్ ఛానళ్ళన్నీ ఆ వార్తనే ప్రసారం చేశాయి. పత్రికలు అచ్చు గుద్దిమరీ ఆ వివరాలు ప్రచురించాయి. ఇంక ఈ విషయం మర్చిపోవచ్చు! అనుకొంది ప్రభుత్వం. ఇందులో ఎవరితప్పూ లేదన్నమాట! ఇక చేసేది మాత్రం ఏముంది? అనుకొనేందుకు ప్రజలు సంసిద్ధం అయిపోతూ ఉన్నారు.

కానీ ఇదేదీ నమ్మలేకపోతున్నాడు స్టీవెన్, ఏదో మిస్టరీ ఉండనే ఉంటుంది, ఇదంతా హిస్టరీని పక్కదారిని పట్టించే ప్రయత్నమే తప్ప మరేమీ కాదనిపిస్తోంది స్టీవెన్‌కు!

అనుమానం రాకూడదేకానీ వస్తే వదిలే తత్వం కాదు స్టీవెన్‌ది. ఎవరెన్ని చెప్పినా వినటమే తప్ప, నమ్మటం అలవాటులేని మనిషి కావటంతో స్టీవెన్ తనంతతానే చక్రవర్తి జీవితం చుట్టూ ఉన్న మిస్టరీని ఛేదించే ప్రయత్నం ఆరంభించాడు.

అసలు చక్రవర్తి జీవితమే మిస్టరీలమయంగా కనిపించసాగింది స్టీవెన్‌కు.

చక్రవర్తిదేమీ సహజంగా చనిపోదగ్గ వయస్సు కానేకాదు. ఆఫ్టరాల్ యాభై సంవత్సరాల వయసుకే చనిపోవటం ఏమిటి అంత ఆరోగ్యవంతుడునూ!

ఆరేడేళ్ళక్రితం చక్రవర్తి సతీమణి కాలధర్మం చెందింది, ఓ నాలుగు నెలల పాటు అనారోగ్యంతో తీసుకొని! ఆవిడపోయి ఇంతకాలం అయింది కాబట్టి ఈయనగారి మరణానికి ఆవిడనుంచి సంక్రమించిన వ్యాధులూ వగైరాలు ఏమీ కారణం అయి ఉండకపోనూవచ్చు. భార్యామణి చనిపోయాక చక్రవర్తి ఒంటరితనం ఓపలేక, ఎవరో ఓ ఆడమనిషితో ఉంటున్న సంగతి జగద్విదితమే అయినా, అది మరీ అంత బహిరంగం కాలేదన్నదీ నిజం! నాలుగైదేళ్ళనుంచీ ఈ ముచ్చట్లు వినిపిస్తూనే ఉన్నా, ఇప్పుడవి అంత ప్రాముఖ్యమైనవి కాకపోవచ్చు.

అవును... అన్నట్లు చక్రవర్తి జీవితంలో ఇదొకటి చెప్పుకోదగ్గ సంగతే... ఆయనకు చదరంగం అంటే చెప్పలేని మోజు. గజశకటతురంగ కాల్బలాలసాయంతో ఆయన చేసేది అరివీరభయంకర యుద్ధమే! శత్రువును నాలుగు దిక్కులనుంచీ నిలువరించి, కదలనివ్వకపోవటం ఆయనకు పరిపాటే! చదరంగంలో ఆయనకు ఆయనే సాటి అని అందరూ అనటం మామూలు విషయమే! అన్నట్లు చక్రవర్తితో చదరంగం ఆడి గెలిచేంత సామర్థ్యం లేకపోయినా, రోజూ చక్రవర్తితో చదరంగం ఆడేందుకు మాత్రం సిద్ధమయ్యే వ్యక్తి చంద్రశేఖరం. చక్రవర్తితో ఆడి గెలవటం తన తరం అయ్యే పనికాదు అంటూ ఉంటాడు చంద్రశేఖరం.

అలాంటిది, మరి ఆ రోజు... ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలీదు! షరా మామూలుగా ఆ రోజూ చదరంగం బల్లముందు కూర్చున్నారు చంద్రశేఖరం, చక్రవర్తి, ఎత్తులు పై ఎత్తులతో బాటు మాటలూ నెమ్మదిగా కలబోసుకొంటూ ఉండగా చంద్రశేఖరం ఏదో ఎత్తు వేయటం జరిగింది. చక్రవర్తి ఆ ఎత్తుకు ఏ పై ఎత్తువేయాలా అని ఆలోచిస్తుండగానే, చంద్రశేఖరం నవ్వుతూ 'బహుశా ఈ వేళ గెలుపు నాదే కాబోలు!' అన్నాడు.

చక్రవర్తి ఖంగుతిన్నాడు.

'మీరు గెలవటం ఏమిటి? ఎప్పటిలాగే ఈ వేళా నేనే గెలుస్తాను చూడండి' అన్నాడు.

'నేను చూడటం ఏమిటి, ఆటను చూడల్సింది మీరే! ఆట చూస్తోంటే గెలుపు నాదేననిపిస్తోంది' అన్నాడు చంద్రశేఖరం.

'అది జరిగే పనికాదు....' ఖచ్చితంగా అన్నాడు చక్రవర్తి.

'చూద్దాం...'

'చూద్దాం. కాదు, పందెం వెయ్యండి అంతనమ్మకం ఉంటే....' అన్నాడు చక్రవర్తి.

'నమ్మకం ఉండబట్టేగదా, గెలుపు నాదేననటం' అన్నాడు మళ్ళీ చంద్రశేఖరం.

'కుదరదు!... మీరు గెలవటం జరగదు! ఒకవేళ మీరేగనుక ఈ ఆటలో గెలిస్తే... ఇంక నేను ఈ ప్రపంచానికి నా ముఖం చూపించను! ఇదే నా పందెం...!' అన్నాడు చక్రవర్తి గర్వంగా.

చంద్రశేఖరం నివ్వెరపోయాడు. 'అదేమిటి అలా అనేశారు... ఇంతోటి ఆఫ్టరాల్ చదరంగం ఆటలో ఇంత పెద్దపందెం దేనికి? మీరిలాటిపంతాలేవీ పట్టకండి... ప్లీజ్' అన్నాడు చంద్రశేఖరం.

'మాట అననే కూడదు. అన్నాక మార్చనే కూడదు! చెప్పానుగదా, ఈ ఆటలోనేను ఓడిపోవటం అంటూ సంభవిస్తే ఇక ఈ గదే నా ప్రపంచం! ఈ గది గోడలు నాలుగే నా జీవితానికి సరిహద్దులు!' అనేశాడు చక్రవర్తి.

మరోమాట మాట్లాడినా, అనవసరమైన రీతిలో అవాంఛనీయమైన పంతాలు పెరిగిపోతాయన్న ధోరణిలో ఇంక నోరు విప్పలేదు చంద్రశేఖరం.

చివరకు అనుకొన్నట్లే చక్రవర్తి ఆ గదిలోనే బందిఖానా అయిపోయాడు. చంద్రశేఖరం ఆ తర్వాత రోజు నుంచీ చక్రవర్తి ఇంటి ముఖం పట్టటం మానేశాడు. చక్రవర్తి కూడా బయటకు రావటం మానేశాడు.

చదరంగం బల్ల మూలబడిపోయింది.

ఇదంతా జరిగి రెండేళ్ళయింది కాబోలు, ఈ పంతాలు పట్టింపులు కథ బహుళ ప్రచారంలోకి వచ్చేసింది.

ఆ గదిలో చక్రవర్తి ఏం చేసేవాడో ఆ కథలు మాత్రం పనిమనుషుల ద్వారా నలుగురి చెవులా పడేవి. పంజరంలో పక్షిలా, బోనులో సింహంలా చక్రవర్తి అక్కడే గడిపేవాడు, మాట్లాడేందుకు తోటిమనుషులు లేక, చేసేందుకు వేరే పనేమీలేక, క్రమంగా చక్రవర్తిలో మానసిక వ్యధ మొదలయింది. అది వ్యాధిరూపం దాల్చింది. శరీరం అంతా వణుకులు మొదలయ్యాయి. కాళ్ళు వాచిపోయేవి. భుజాలు భరించలేని నొప్పి పెట్టేవి. ఇవి చాలవన్నట్లు వాంతులు, తీవ్రమైన తలనొప్పి... చర్మం అంతా క్రమంగా రంగు మారుతూ, పసుపు పచ్చగా అయిపోసాగింది.

'ఈ లక్షణాలేవీ అంతుబట్టటంలేదు' అనుకొంటూ డాక్టర్ సంజీవరావ్ తన మెడికల్ బుక్స్ పదేపదే తిరిగేసేవాడు. స్పెషలిస్ట్ ఫ్రెండ్స్‌ను సంప్రదించేవాడు.

'అంతవర్రీ కావల్సిందేమీలేదు సంజీవరావ్! చక్రవర్తి లక్షణాలన్నీ హైపోకాండ్రియాక్‌వే! ఆరోగ్యం అంత బాగుండలేదనుకుంటూ అనవసరంగా వర్రీ అవటం ఇది. అంతకు మించి మరేమీలేదు!' అన్నాడొక స్పెషలిస్ట్.

అయినా చక్రవర్తి ఆరోగ్యం నానాటికి తీసికట్టు అయిందే తప్ప తగ్గలేదు. ఆఖరికి ఓ రోజు కోమాలోపడి, చివరికి... జీవితానికి చరమగీతం పాడేశాడు.

ఇదంతా కాన్సరస్ అల్సర్ ఆఫ్ స్టమక్ అన్నారు వైద్యులు. చక్రవర్తి తండ్రికూడా ఇలాంటి కాన్సర్‌తోనే పోయారు సుమా అంటూ గత చరిత్రలను తవ్విమరీ నిజాలు గుప్పించాయి పత్రికలు.

'చక్రవర్తి పర్సనల్ ఫిజిషియన్ సంజీవరావు వైఫల్యం ఇది. వ్యాధిని గుర్తించలేక, సరైన చికిత్స చేయ్యలేక చివరికి పోస్ట్‌మార్టమ్ తెరవెనుక దాక్కునే ప్రయత్నం ఇది!' అని ఒకటి రెండు పత్రికలు సన్నగా చిన్నగా తమ అనుమానాల్ని బయట పెట్టాయి.

స్టీవెన్ పోస్ట్‌మార్టమ్ రికార్డ్ కాపీని సంపాదించాడు. చదువుతోంటే అందులో వాళ్లు రాసిన అవయవలక్షణాలేవీ కాన్సర్‌కు సరిపోయేవికావు. అయినా డాక్టర్లు కాన్సర్ అనే అనేశారు.. స్టీవెన్‌కు ఈ మిస్టరీ మరింత చిక్కబడుతున్నట్లు అనిపించింది. అందుకే ధైర్యంచేసి ఒకరిద్దరు పత్రికా విలేఖరుల సాయంతో, హెల్త్ మినిస్టర్‌ను సంప్రదించి చక్రవర్తి, తలమీది వెంట్రుకలను కూడా పరిశీలించేందుకు పర్మిషన్ సంపాదించాడు.

'ఇది ఆర్సెనిక్ పాయిజనింగ్' అన్నారు లాబ్ సైంటిస్టులు.

'అంటే హత్యఅంటారా?' అనడిగాడు స్టీవెన్.

'చెప్పలేం! నిజానికి కొన్ని రకాల మందుల్లో కొద్దిపాటి ఆర్సెనిక్ ఉండటం చరిత్రలో ఉన్న విషయమే! కానీ చక్రవర్తికి చికిత్సకోసం సంజీవరావు వేరుగా ఆర్సెనిక్ వాడి ఉంటాడా అనేది సందేహమే! అయినా, చక్రవర్తిని చంపాల్సిన అవసరం సంజీవరావుకు ఏముంటుందో ఆలోచించండి!' అన్నారు వాళ్ళు.

'స్టీవెన్! ఏమైనా అయి ఉండొచ్చుకానీ ఒకటి మాత్రం నిజం! చక్రవర్తి తలవెంట్రుకలు చెప్పేది వాస్తవం. మామూలుకు మించిన నిష్పత్తిలో చక్రవర్తి ఇంటిలో ఆర్సెనిక్ చేరింది. అదెలా జరిగిందో మీరు చెప్పాలి! చక్రవర్తి అంటే గిట్టనివాళ్ళు రోజూ ఆయన మందుల్లోనో, టానిక్కుల్లోనో ఆర్సెనిక్ కలిపి ఉండొచ్చు. లేదా ఆయన పీల్చిన గాలిలో ఆర్సెనిక్ అధికంగా ఉండొచ్చు! ఇదీ అని చెప్పలేం పూర్తి పరిశోధనలు జరిగితే తప్ప!' అన్నారు నిపుణులు.

జీవితంలో మిస్టరీలంటే స్టీవెన్‌కు నచ్చదు.

ఏది ఎందుకు ఎలా జరుగుతుందో తెలుసుకొంటే తప్ప అతనికి నిద్రపట్టదు. అడుగు ముందుకు వేసి, ఆపై ఆగిపోవటం అతని ఒంటికి గిట్టదు.

ఓ వారం గడిచాక చక్రవర్తి ఉన్న గదికి వెళ్ళాడు స్టీవెన్. ఆ గది గోడలన్నీ చక్రవర్తి చివరి రోజు కథలన్నీ బయటకు పొక్కకుండా దాచి పెడుతున్నట్లుగా ఉన్నాయి.

చక్రవర్తి తమను విడిచి వెళ్ళిపోయినందుకు కన్నీరు నింపుకున్నట్లు ఉన్నాయి.

పచ్చదనంతో నిండిన పండులాంటి జీవితం పచ్చబడి రాలిపోయినందుకు గదిగోడల పచ్చదనం కూడా రాలిపోయేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు ఉంది.

అయినా ఆ గదిలోకి వీస్తున్న గాలి మాత్రం స్వచ్ఛంగా ఉంది. స్వస్థతను అందివ్వలేక పోవచ్చుగాని అస్వస్థుల్ని చేసేలా మాత్రం లేదు.

ఆ గదిలో, ఆ గదిని పరీక్షిస్తూ తిరుగుతున్న స్టీవెన్‌కు హఠాత్తుగా తట్టింది ఆ విషయం! నెమ్మదిగా రెండడుగులు వేసి ఆ గదిగోడల్ని తడిమాడు. అసలు నిజం చెప్తున్న ఆ నిజాయితీ గోడల్ని స్టీవెన్ మరోసారి చూశాడు.

మిస్టరీ విడిపోతోందన్న సంతోషం స్టీవెన్‌లో ఆ క్షణం నిండుగా ఉంది.

❖ ❖ ❖

వారం రోజుల తర్వాత 'చెప్పండి మీరు కనిపెట్టిన విషయం ఏమిటో!' అన్నారు హెల్త్ మినిస్టర్.

స్టీవెన్ నెమ్మదిగా అన్నాడు 'చక్రవర్తిగారి మరణం సహజంగా జరిగిందికాదు'.

'అంటే ఇది హత్యా?' ఆదుర్దాగా మంత్రిగారు.

'కాదండీ, అది సహజమరణమూ కాదు, అసహజ మరణమూకాదు!' అన్నాడు స్టీవెన్.

'రెండూ కాకుండా మరేమిటయి ఉంటుంది?'

'అదే చెప్తున్నా.... తెలీక జరిగిన పొరపాటు అది. చక్రవర్తిగారి గదిగోడలకున్న పెయింట్ మీరు చూసే ఉంటారు. ఆ పెయింటింగ్ రంగుల్లో కలిసి ఉంది ఆర్సెనిక్! మామూలుగా అయితే అది హానికరం కాదు. కానీ చక్రవర్తిని చంపింది మాత్రం ఆ గదిగోడల్లోని ఆర్సెనిక్ అది నిజం!'

హెల్త్ మినిస్టర్ చిత్రంగా చూసాడు 'గోడల్లో ఆర్సెనిక్ హానికరం కాదంటున్నారు. అయినా అదే చంపిందంటున్నారు... మీరు చెప్పేది చాలా విచిత్రంగా ఉంది' అన్నారు.

'అవును, చిత్రంగానే ఉంది మరి! సాధారణ పరిస్థితుల్లో హానికరంకాని ఆర్సెనిక్ ఆ గదికి ఆనుకొని ఉన్న బాత్‌రూమ్‌లోంచి నీళ్ళు గోడల్లోకి ఇంకిపోవటంతో విషపూరితం అయింది. నీటి చెమ్మ తగిలిన ఆర్సెనిక్, ఆ తడికి ఉబ్బుతుంది. అప్పుడు అక్కడి గాలిలో కలిసి గదిని విషపూరితం చేస్తోంది. ఆ గాలిపీల్చిన చక్రవర్తి ఆరోగ్యం క్రమంగా పాడయింది. ఇది మనం ఎవ్వరమూ గుర్తించలేకపోయాం!' అన్నాడు స్టీవెన్.

'చిత్రంగా ఉంది మీరు చెప్పిందంతా... అసలు నమ్మబద్ధికావటం లేదు గదిగోడలు విషం చిమ్మటం అంటే!.....' అన్నారు మంత్రిగారు.

స్టీవెన్ నవ్వాడు 'కొన్ని నిజాలు విచిత్రాలకంటే విచిత్రంగా ఉంటాయంటారు. ఇదీ అలాంటిదే అనుకోవాలి!'

క్షణం ఆగి అడిగారు మంత్రిగారు 'అవునూ...గదిగోడలు విషం చిమ్ముతాయని మీరెలా ఊహించారు? అసలు మీరేం చేస్తుంటారు?'

'నేను ఓ కెమికల్ ఇంజనీర్‌ను! ఇక్కడి పెయింట్స్ ఫ్యాక్టరీలో వర్క్స్‌మేనేజర్‌గా పనిచేస్తున్నాను!' అన్నాడు స్టీవెన్ బహు నెమ్మదిగా!!

– దిక్సూచి, మార్చి *2000*